క్లుప్తంగా

పీ 4 సర్వేపై గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ స్టాలిన్

కడియం: జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం పీ 4 సర్వేపై గ్రామసభ నిర్వహించారు. పీ 4 సర్వే ద్వారా గుర్తించిన ఆర్థికంగా వెనుకబడిన వారి జాబితా చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ రామకృష్ణ, గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, అంగన్‌వాడీ, డ్వాక్రా, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

కడియం: కడియం ఏరియా వెటర్నరీ హాస్పిటల్‌లో సోమవారం ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రారంభించి, ప్రదర్శనను తిలకించారు. అనంతరం లేగదూడల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పాల క్యాన్లు, మందులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, కడియం సహాయ సంచాలకులు డాక్టర్ జి.రవివర్మ, ప్రజాప్రతినిధులు, పాడిరైతులు, పశువైద్యులు పాల్గొన్నారు.

డ్రోన్లతో ప్రత్యేక నిఘా

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో అసాంఘిక శక్తులను, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా డ్రోన్ కెమెరాలతో క్షేత్రస్థాయిలో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డి. నరసింహకిశోర్ సోమవారం తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్, జూదం తదితర నేరాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. దీనికి డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేకంగా పాడుపడిపోయిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తామన్నారు.

బత్తులరామును పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: మాతృవియోగంతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత బత్తుల రామును సోమవారం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. బత్తుల రాము మాతృమూర్తి సూర్యకాంతం ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్రపటానికి ఆకుల వీర్రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, వెలుగుబంటి అచ్యుతరామ్, దొంతంశెట్టి చినవీరభద్రయ్య తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రకాశం నగర్ : సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో నాయకుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, ఈ ధర్నాకు ప్రజలు ఇళ్ల సమస్యలపై దరఖాస్తులు తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టీ.అరుణ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్యామల సెంటర్ వద్ద గల పార్టీ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, టిడ్కో ఇళ్లు వెంటనే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ.5 లక్షలు సహాయం అందించాలన్నారు. టిడ్కో ఇంటికి ఇచ్చిన బ్యాంకు రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సినిమాలు



శ్యామల	:	పెళ్లికానిప్రసాద్
సూర్యమినీ	:	కాలమేగాకరిగింది, దిల్‌రూబా
సూర్యప్యాలెస్	:	టక్‌టక్, ఎవడే సుబ్రహ్మణ్యం
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	పెళ్లికానిప్రసాద్
అనుశ్రీ	:	శబ్దం
ఊర్వశి	:	కోర్ట్
మేనక	:	ఆర్టిస్ట్,కిస్‌కిస్‌కిసిక్
రంభ	:	షణ్ముఖ
కుమారి	:	రిటర్న్‌ఆఫ్‌ద్రాగన్
అప్సర	:	సలార్
అశోక నామవరం	:	చావా
వీఎస్.మహల్ ధవళేశ్వరం	:	పెళ్లికానిప్రసాద్
మురళీకృష్ణ కడియం	:	కోర్ట్
వెంకటసూర్య	:	కోర్ట్

వంటకు టాటా.. కర్రీ పాయింట్ బాట

- కొత్త రుచులను పరిచయం చేస్తున్న కర్రీ పాయింట్లు
- ఇళ్లలోనూ వంటావార్పుకు అప్పుడప్పుడూ బ్రేక్
- పుట్టగొడుగుల్లా కర్రీ పాయింట్లు
- ఆదివారం ప్రత్యేక వంటకాలు సిద్ధం



దానవాయిపేటలోని కర్రీ పాయింట్ వద్ద కొనుగోలుదారులు



వివిధ కూరలు వాటి ధరల బోర్డు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉరుకులు పరుగులు జీవితంలో ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించి వంటలు చేసుకోవడం చాలామందికి కష్టతరంగా మారింది. హోటళ్లలో భోజనం ఖర్చుతో కూడుకుంది కావడంతో అన్నం మాత్రం వండుకుని కర్రీస్‌ను బయట కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీంతో నగరంతో పాటు పరిసర గ్రామాల్లోనూ కర్రీస్ పాయింట్లు పట్టుగొడుగుల్లా వెలిశాయి.

రోజుకో ఒక స్పెషల్ కర్రీ

రాజమహేంద్రవరం నగరంతో పాటు పరిసర గ్రామాల్లో కర్రీస్ పాయింట్లకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. అందుకు తగ్గట్టు కొత్త రుచులతో ఆహార ప్రియులకు నిర్వాహకులు రోజుకో ఒక స్పెషల్ కర్రీని పరిచయం చేస్తున్నారు. నాన్‌వెజ్ కూరల్లో కొత్త రకాలను పరిచయం చేస్తూ కర్రీ పాయింట్లు నగరవాసుల మన్ననలు పొందుతున్నాయి.

సుమారు 250 పైగా కర్రీ పాయింట్లు

సుమారు 15 ఏళ్ల క్రితం నగరంలో ఒకటో రెండో కర్రీ పాయింట్లు ఉండేవి, కొన్ని హోటళ్లలో కూరలు విక్రయించేవారు. రాజమహేంద్రవరంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రస్తుతం సుమారు 250 పైగా కర్రీ పాయింట్లు ఉన్నాయి. ముఖ్యంగా నగరంలోని ముఖ్య కూడళ్లతో పాటు, స్టడీ సెంటర్లు ఉన్న ప్రాంతాలతో పాటు ప్రతి వీధిలోనూ చిన్నాచితకా కర్రీ పాయింట్లు దర్శనమిస్తున్నాయి. హోటళ్లకు అనుబంధంగా కర్రీ పాయింట్లను ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు.

నిత్యావసరాలు ఖర్చులు పెరగడంతో..

గతంలో పోలిస్తే కూరగాయలు, నిత్యావసర వస్తువులు ధరలు పెరిగాయి. దీంతో గ్యాస్, నిత్యావసర వస్తువులకు ఖర్చు చేయడం కన్నా 20 నుంచి 30 రూపాయలతో ఒక కర్రీ ప్యాకెట్, పెరుగు తెచ్చుకుని వాటితోనే చాలామంది భోజనం ముగిస్తున్నారు. సాంబార్, పప్పు, రసానికి కలిపి రూ.60 నుంచి రూ.80 వెచ్చిస్తే నలుగురు వ్యక్తులు తినేందుకు సరిపోతుంది. ఇంట్లో అన్నం వండుకుని కర్రీస్ కొనుగోలు చేస్తే రోజు గడిచిపోతుందని చాలామంది భావిస్తున్నారు.

జీవనోపాధికి దోహదం

హోటళ్లలో పనిచేసిన అనుభవం ఉన్నవారు, సొంత కాళ్లపై నిలబడాలనే ఉద్దేశ్యంతో కర్రీ పాయింట్లు ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఇంటి పెద్ద మాత్రమే కాకుండా ఇంట్లోని భార్య, పిల్లలు కర్రీ పాయింట్‌లో అవసరమైన పనులు ఒకరికి ఒకరు సహాయపడుతూ బతుకు జీవనాన్ని నెట్టుకొస్తున్నారు. ఉదయం 4 గంటల నుంచి కర్రీకి సంబంధించి కూరగాయలు, ఇతర వస్తువులను సమకూర్చుకుంటారు. ఉదయం 11 గంటలకే అన్ని రకాల కూరలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచుతారు. సాయంత్రానికి తిరిగి మళ్లీ వంటకాలు చేయాల్సి ఉంది. కుటుంబ సభ్యులందరూ కలసి పనులు పంచుకుంటారు. వీరిలో నాణ్యత పాటిస్తూ రుచిగా కూరలు అందించిన వాళ్లకు మాత్రమే ఆదరణ లభిస్తుంది.

వివిధ రకాల పచ్చళ్లు

కర్రీ పాయింట్లతో అనేక రకాల పచ్చళ్లు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. కొన్ని కర్రీ సెంటర్లు వారంలో ప్రతి రోజు ఒక్కో రకం పచ్చళ్లను అందుబాటులో ఉంచుతున్నాయి. వివిధ రకాల కారపు పొడులు సైతం విక్రయిస్తున్నారు. నాన్‌వెజ్ వేపుడు, వెజ్‌లో కూడా పలు కొత్తరకాల వంటకాలు, వేపుళ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆదివారం వ్యాపారం జోరు

ఆదివారం వచ్చిందంటే నగరవాసులు సినిమాలు, షికార్లకు వెళుతుంటారు. రోజంతా పిల్లలతో గడుపుతుంటారు. బయట వంటకాలు రుచి చూసేందుకు ఇష్టపడుతుంటారు. దీంతో ఆదివారం హోటళ్లతో పాటు కర్రీపాయింట్లు కూడా ప్రత్యేకంగా నాన్‌వెజ్ రుచులను అందుబాటులోకి తెస్తుంటాయి. చికెన్, మటన్ కూరలు, వేపుళ్లు, రొయ్యలు, కౌజు పిట్టల కూర, చేప, బొమ్మిడాయిల పులుసు తదితర కర్రీలు విక్రయిస్తుంటారు. సాధారణ రోజుల్లో కంటే ఆదివారం తమ వ్యాపారం జోరుగా ఉంటుందని కర్రీ పాయింట్ నిర్వాహకులు చెబుతున్నారు.

రుచి, నాణ్యత ఉంటేనే ఆదరణ



13 సంవత్సరాలుగా కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నా. అయితే రుచి, నాణ్యత ఇవ్వగలిగితేనే కస్టమర్లు కూరల కోసం వస్తారు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు ధరలు హెచ్చుతగ్గులున్నా కొనుగోలుదారుల కోసం అందుబాటు ధరల్లో పలు రకాల కూరలు విక్రయిస్తాం.

– టి.చాముండేశ్వరి, కర్రీ పాయింట్ నిర్వాహకురాలు, రాజమహేంద్రవరం

రాధామనోహర్‌దాస్‌పై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఆల్‌ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: క్రైస్తవులు మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన రాధామనోహర్‌దాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా క్రైస్తవ సమాజం తరుపున రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ.కొమనాపల్లి ప్రతాప్‌సిన్హా, క్రైస్తవులు కలెక్టరేట్‌లోని డీఆర్వో సీతారామ్మూర్తికి, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహకిషోర్‌కు రాధామనోహర్‌దాస్‌పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌సిన్హా మాట్లాడుతూ ఇటీవల రాధామనోహర్‌దాస్ ధవళేశ్వరంలో క్రైస్తవులు మనోభావాలు దెబ్బతినేలా దుర్భాషలాడారన్నారు. రాధామనోహర్‌దాస్ రాష్ట్రం అంతా సంచరిస్తూ క్రైస్తవ మత విశ్వాసులను, ఏసుక్రీస్తును అసభ్య పదజాలంతో దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవ.డాక్టర్ జుహన్‌హాలోనెన్, బ్రదర్.డాక్టర్ కోడే మోజెస్‌కిరణ్, రెవ.విజయసారథి, రెవ.పి.టాటావిక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ సోమవారం ప్రకటించారు. దీని ప్రభావంతో సుబ్బారావు నగర్ విద్యుత్ సబ్–స్టేషన్ పరిధిలో భవానీపురం, కోలమూరు ఫీడర్లలో ప్రభావం ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ మీ కోసం ద్వారా ప్రజల నుంచి పలు సమస్యలపై స్వీకరించిన అర్జీలకు సత్వర న్యాయం అందిస్తామని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కలసి ప్రజల నుంచి 32 అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్యం నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న, ఎస్ఈఎం సీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య పాల్గొన్నారు.

నిర్దేశిత కాలవ్యవధిలో అర్జీల పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారునికి పూర్తిస్థాయి న్యాయం చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం వేదికకు వచ్చిన అర్జీలను డివిజన్‌స్థాయి అధికారులతో కలసి ఆయన స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి 7 అర్జీలను స్వీకరించామన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదారుకి న్యాయం చేస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు

రాజమహేంద్రవరం సిటీ: రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో సోమవారం బొమ్మూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ మాట్లాడుతూ దేశమంతా కుల గణన జరపాలని, ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కుల వివక్షను ప్రాతిపదికగా తీసుకోవాలని కోరారు. ఎస్సీల విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణ ద్వారా ఎస్సీ కులాల్లో వైషమ్యాలు పెంచిపోషిస్తున్నారని, శాశ్వతంగా రిజర్వేషన్లు అంతం చేయడమే వర్గీకరణ ఉద్దేశమని బీఎస్పీ భావిస్తోందన్నారు. నల్లజర్ల మండలం దూబచర్లలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిర్రా రాజు, కొండపల్లి సూరిబాబు, అబ్దుల్, నక్కా వెంకటరత్నంరాజు పాల్గొన్నారు.

మహనీయులను అవమానించడం హేయమైన చర్య



ఎస్పీ నరసింహ కిశోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వేశ్వర రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో నల్లజర్ల మండలం దూబచర్లలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానపరిచిన నిందితులను గుర్తించి పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేసారు. సోమవారం జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులను స్మరించుకుంటూ నిర్మించిన విగ్రహాలను కొందరు దుర్మార్గులు, కూలగొట్టడం, నష్టపరచడం, అవమానపరిచేటట్లుగా చేయడం వంటి చర్యలు హేయమైనవని అన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తడాల కొండ్రాజు, రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ పడయార్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ సాఖ పుల్లారావు, జిల్లా బీసీ సెల్ చైర్మన్ విచ్చేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కృషి



ఆస్పత్రి ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యసిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో రోగులు అగచాట్లకు గురవుతున్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ మార్చురీలో బాధ్యతారాహిత్యంగా పని చేసే వారందరినీ గుర్తించి తొలగిస్తున్నామన్నారు. ప్రైవేటుకు దీటుగా రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో 40 శాతం సిబ్బంది కొరత ఉందని, ఈ లోటు భర్తీ చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణేశ్వరరావు, ఉప్పులూరి జానకి రామయ్య, కడలి రామకృష్ణ పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలను తరిమికొడదాం

ప్రకాశంనగర్: బీజేపీ మతోన్మాద రాజకీయాలను దేశం నుంచి తరిమికొడదామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వనజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎన్డీఏ కూటమి మరొకసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతం పేరుతో ప్రజలను విడదీసి వివాదాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ విధానాల వల్ల లౌకిక ప్రజాతంత్ర వాదానికి దేశంలో పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పేదలకిచ్చే ఇళ్ల స్థలాల కోసం రూ.10 వేల కోట్లు కేటాయించి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసేందుకు, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే స్వాధీనపరచేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు .

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ఆదరణ–3 పథకాన్ని వృత్తిపని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సోమవారం హుకుంపేట మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదరణ–3 పథకంపై దరఖాస్తుదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోరంట్ల ఆదరణ పథకంలో నాణ్యమైన పనిముట్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పార్టీ నాయకులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

కడియం నర్సరీ అందాలు అద్భుతం



డాక్టర్ కె.పద్మావతికి పూలమొక్కను అందజేస్తున్న నర్సరీ రైతు మల్లు పోలరాజు

కడియం: కడియపులంక జాతీయ రహదారిపై ఉన్న శివాంజనేయ నర్సరీ, వీరవరం రోడ్డులో ఉన్న పల్ల వెంకన్న నర్సరీని సోమవారం ఉదయం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డా.కె.పద్మావతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం పచ్చదనంతో నిండిన ప్రాంతంలో జీవిస్తున్న ఈ ప్రాంత ప్రజలు అదృష్టవంతులని, ప్రజారోగ్యానికై అహర్నిశలు కృషిచేస్తూ నర్సరీలను అభివృద్ధి చేస్తున్న రైతులు అభినందనీయులని తెలిపారు. నర్సరీల సందర్శన అనంతరం ఆమె విజయవాడ తిరిగి వెళ్లారు. ఈ సందర్భంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ వెంట వివిధ జిల్లా కార్యక్రమ అధికారులు డాక్టర్లు కె.శ్రీవల్లి, పి.నిషాంత్, సెంట్రల్ జైలు వైద్యాధికారి డాక్టర్ పి.కోమల ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ ఎస్ విల్సన్ పాల్, కేఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్



మాట్లాడుతున్న వాసంశెట్టి గంగాధర్

రాజమహేంద్రవరం : ఇండియన్‌నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) తూర్పుగోదావరి జిల్లా నూతన అధ్యక్షుడిగా రాజమండ్రి ఆటో వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి ద్వారా నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు ఆయన సోమవారం తెలిపారు. స్థానిక కంబాలచెరువు వద్ద ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో తాను ఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసినట్టు గుర్తు చేసారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తూ వారికి అండగా నిలబడటమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమావేశంలో కోస్టల్ పేపర్స్, ఓఎన్‌జీసీ పెట్రోలియం ఎంప్లాయీస్ యూనియన్, క్వారీ లారీ యూనియన్, రాజమండ్రి ఆటోవర్కర్స్, గోదావరి ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ మోటార్ వర్కర్స్ యూనియన్, యునో సాల్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల కేంద్రంలో వీసీ పరిశీలన



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరంలోని ఏకేసీ, ఆదిత్య, రాజీవ్‌గాంధీ డిగ్రీ కళాశాలలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సందర్శించి, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేలా చేసిన ఏర్పాట్లను, నిఘా వ్యవస్థ తీరును పరిశీలించారు. ఉమ్మడిగోదావరి జిల్లాలోని 109 కేంద్రాల్లో 22 వేల మంది డిగ్రీ విద్యార్థులు 4, 6 సెమిస్టర్లు, 20 కేంద్రాల్లో 2,500 మంది బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ విద్యార్థులు ఒకటో సెమిస్టర్, మూడు కేంద్రాల్లో 500 మంది లా విద్యార్థులు 8, 10 సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నారు.

గోదావరిలో దూకి మహిళ మృతి

కంబాలచెరువు: గుర్తుతెలియని మహిళ సోమవారం పుష్కర్‌ఘాట్ వద్ద గోదావరి నదిలో దూకి మృతి చెందింది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళ నదిలో దూకింది. దీన్ని చూసిన స్థానికులు వెంటనే వారించినా ఫలితం లేకుండా పోయింది. ఆమె నదిలో మునిగిపోయింది. విషయం తెలిసిన మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని వెలికితీసారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఆమె మృతదేహాన్ని ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించొద్దు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం: అభివృద్ధి పనులకు ఆటంకాలు కల్పిస్తే సహించలేదని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ దుళ్లలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపడితే ఆ ప్రభుత్వం భూమికి సంబంధించి ఫోర్జరీ పత్రాలు సృష్టించిన వారిపై నాన్ బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా సీఐ సెక్షన్లు తగ్గించి ఎఫ్ఐఆర్ రాయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకునే వారు ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదన్నారు. మండల కేంద్రమైన కడియంకు విద్యుత్తు సబ్ స్టేషన్ మంజూరైందని త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో కడియం హైస్కూల్ రోడ్డు వెడల్పు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ గిరిజాల బాబు మాట్లాడుతూ బొబ్బిలి బ్రిడ్జిని పునర్నిర్మించాలని, జలజీవన్ మిషన్ పనులపై దృష్టి సారించాలని కోరారు. శాఖల వారీగా ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో కె. రమేష్, రాష్ట్ర పర్యాటక శాఖ సభ్యుడు వాసిరెడ్డి రాంబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కలిదిండి విశాలాక్షి, జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అనుమతులు లేని ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు

సీతానగరం: ప్రభుత్వం ఇసుక ఉచితం చేసింది. ఇదే అదునుగా ఇసుకాసురులు అనుమతులు లేని ర్యాంపుల్లో బాహాటంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ముగ్గళ్ల, సీతానగరం కైలాస భూమి తదితర ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి అక్రమ రవాణా చేస్తున్నారు. గ్రామాల్లో స్టాక్ పాయింట్లు పెట్టి లారీలపై ఇసుక ఎగుమతులకు పాల్పడుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తవ్వి ట్రాక్టర్లపై తరలించి గ్రామాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని, లారీలపై ఎగుమతి చేసి జేబులు నింపుకుంటున్నారు. నిత్యం మండలం పరిధిలోని గ్రామాల్లో అనధికార స్టాక్ పాయింట్ల నుంచి అధిక సంఖ్యలో లారీపై ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. అనుమతులు లేని సీతానగరం కైలాసభూమి, ముగ్గళ్ల ర్యాంపు నుంచి ఇసుక తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తున్నా, అనధికార స్టాక్ పాయింట్లు నెలకొల్పినా అధికారులు పట్టించుకోవడం లేదు.